‘టీటీడీ కూడలి’కి ఆధ్యాత్మిక శోభ



ప్రత్యేక మొక్కలతో అభివృద్ధి చేసిన గ్రీనరీ

- సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం
- కనువిందు చేస్తున్న శ్రీవారి శంకు చక్ర నామాలు
- కబుల్ స్టోన్ వర్క్, బ్యూటిఫికేషన్‌తో ఆకట్టుకుంటున్న కూడలి అందాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో పనులు ప్రారంభం



ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలికి ఆధ్యాత్మిక శోభ తెచ్చిన శంకు చక్ర నామాలు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణతో కనువిందు చేస్తోంది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం (ప్రాజెక్ట్స్) ఈ కూడలిని ఆధునికీకరించిన విషయం తెలిసిందే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు విభాగం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ప్లాన్‌కు అనుగుణంగా అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సర్వాంగ సుందరంగా కూడలిని తీర్చిదిద్దింది. నిర్మాణంలో కబుల్ స్టోన్ వర్క్, ఫౌంటెన్, బ్యూటిఫికేషన్, శ్రీవారి శంకు చక్ర నామాల ఏర్పాటు ప్రధానంగా నిలిచాయి. పనులు పూర్తికావడంతో ఇటీవల ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం కూడలి అందాలు స్థానికులకు, వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రాత్రి పూట విద్యుత్ కాంతులతో కూడలి కనువిందు చేస్తోంది. అయితే బ్యూటిఫికేషన్ నిర్వహణపై కూడా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించి ఆహ్లాదాన్ని పెంపొందించాలని అందరూ కోరుతున్నారు.



ఆధునికీకరణతో కొత్త శోభను సంతరించుకున్న టీటీడీ కూడలి

రూ.1.07 కోట్లతో ఆధునికీకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1.07 కోట్ల వ్యయంతో ఎంవీపీ కూడలి ఆధునికీకరణ పనులను చేపట్టారు. సర్కిల్ చుట్టూ ప్రత్యేక డిజైన్‌తో కూడిన కబుల్ స్టోన్ వర్క్, బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి, ఫౌంటెన్ నిర్మాణం, శ్రీవారి శంకు చక్ర నామాల ఏర్పాటు పనులు చేపట్టారు. గతంలో పనుల నిర్వహణలో కొంత జాప్యం జరిగినప్పటికీ జీవీఎంసీ ప్రాజెక్టు విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాంట్రాక్ట్ సంస్థకు నిర్దిష్ట సూచనలు చేయడంతో పనులు వేగంగా పూర్తయ్యాయి. ఇందులో భాగంగా రికార్డ్ సమయంలో కూడలి చుట్టూ కబుల్ స్టోన్ వర్క్ పూర్తి చేశారు. దీంతోపాటు మిగిలిన పనులు కూడా చకచకా పూర్తి చేసి ఇటీవల ప్రారంభించారు. దీంతో టీటీడీ కూడలి ఆహ్లాదకరంగా దర్శనమివ్వడంతోపాటు శ్రీవారి శంకుచక్రనామాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ

టీటీడీ కూడలి ఆధునికీకరణపై తొలి నుంచి జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం స్పష్టమైన ప్లాన్‌తో ముందుకు వెళ్లడం జరిగింది. ఇందులో భాగంగా కాంట్రాక్ట్ సంస్థకు ఆయా పనుల్లో నాణ్యత, ప్రాధాన్యతపై నిత్యం అవగాహన కల్పించాం. అనుకున్న విధంగా పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం కూడలిలోని ఆహ్లాదకర వాతావరణాన్ని అందరూ ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే నిర్వహణ బాధ్యతను నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ సంస్థకు అప్పగిస్తాం.

– సత్యనారాయణరాజు, ఎస్‌ఈ, జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం

కుటుంబం చెంతకు మహిళ

అల్లిపురం: భర్త, అత్త వేధింపులు తట్టుకోలేక ఇంటి నుంచి బయటికి వచ్చిన కాకినాడకు చెందిన వివాహిత వానపల్లి జ్యోతిశ్రీకి ఈ నెల 13వ తేదీన మహారాణిపేట పోలీసులు ఏయు టీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఆమె భర్త, తండ్రిని పిలిపించిన ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం భర్త వానపల్లి లీలామోహన్, తండ్రి ఇమంది తమ్మయ్యలకు జ్యోతిశ్రీని గురువారం అప్పగించారు. జ్యోతిశ్రీ కొన్ని రోజులు తండ్రి దగ్గర ఉంటానని చెప్పడంతో, వారితో పూచీకత్తు లేఖ రాయించుకుని జ్యోతిశ్రీని పంపించినట్లు వాసు తెలిపారు.

క్లుప్తంగా

నీటి ట్యాంక్ ప్రారంభం

ఆరిలోవ : జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి అప్సరా కాలనీలో కొద్ది రోజులుగా తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో స్థానికులు నీటి సరఫరా విభాగం అధికారులు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు అప్సరా కాలనీలో రెండు రోజుల క్రితం నీటి ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ ట్యాంక్‌ను ఎమ్మెల్యే వెలగపూడి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముగడ రాజారావు, రాగతి అచ్చుతరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురంలో కొండచిలువ హల్‌చల్



కొండచిలువను పట్టుకున్న జక్కన్న

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలో బుధవారం రాత్రి కొండచిలువ జనారణ్యంలోకి చేరి హల్‌చల్ చేసింది. సుమారు 7 అడుగుల పొడవున్న కొండచిలువ దేవస్థానం కొండ వైపు నుంచి వస్తూ రాత్రి చీకటిలో కాలనీలోని నివాసాల మధ్యకు చేరింది. దీంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఓ ఇంటి వద్ద మూలన చేరిన కొండచిలువను స్థానిక నివాసి జక్కన్న చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టాడు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. కొండచిలువను పట్టుకున్న జక్కన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి

మద్దిలపాలెం : యువత సృజనాత్మకంగా ఆలోచిస్తూ పని చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు రంగోలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీర్చిదిద్దిన వివిధ రంగవల్లులను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఆ చిత్రాన్ని తీర్చిదిద్దడం వెనుక ఉన్న ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.


హయ్యర్ పెన్షన్ అందించడంపై హర్షం



బీచ్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

ఏయూ క్యాంపస్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అందించడంపై కృతజ్ఞతలు తెలుపుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో ఎంపీ శ్రీభరత్, నేషనల్ ఆఫీసర్స్ అధ్యక్షులను సత్కరించారు. హయ్యర్ పెన్షన్ అందని వారికి సైతం లభించే విధంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రరావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏటీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, బోసు బాబు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



క్రిష్ణా కళాశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాలని, తమ ఇళ్లపై ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, పీవోలు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, యం.బాలక్రిష్ణ, డాక్టర్ ఆర్.కుసుమ కుమారి, డాక్టర్ యం.శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దేశ అభ్యున్నతే లక్ష్యంగా సాగాలి



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జాతీయ జెండాలతో షారోన్ రాజు, విద్యార్థులు

మద్దిలపాలెం : దేశ అభ్యున్నతి, వికాసమే ప్రధాన లక్ష్యంగా యువతరం ముందుకు సాగాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. విద్యా విభాగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని గురువారం ఏయూలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ భారత దేశంలో జన్మించిన ప్రతీ ఒక్కరూ దేశ సమగ్రతకు కృషి చేస్తూ, అభివృద్ధికి చోదకశక్తిగా మారాలని పిలుపునిచ్చారు. యువతరం జ్ఞానాన్ని, మేధస్సును నూతన ఆవిష్కరణలు చేసే దిశగా వినియోగించాలని సూచించారు. తద్వారా సాంకేతికంగా భారతదేశం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భారతదేశానికి స్వాతంత్ర్య సముపార్జన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవడం, వారి సేవలను గుర్తు చేసుకుంటూ వారు అందించిన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం ఎంతో అవసరమన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేయడానికి దేశీయంగా ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగడం ద్వారా నూతన అవకాశాలను సృష్టించాలని కోరారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాలను పట్టుకుని విద్యార్థులు భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి, డాక్టర్ ప్రవీణా దేవి, డాక్టర్ రాము పాల్గొన్నారు.


హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సహకారంతో నిర్వహించనున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ (ఏక్యూవీహెచ్) 2025లో భాగంగా నిర్వహించే విశ్వవిద్యాలయ స్థాయి పోటీల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌ను సెప్టెంబర్ 13న నిర్వహించనుంది. ఇందుకు సన్నాహకంగా విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఏయూ పరిధిలోని కళాశాల విద్యార్థులకు ఆగస్టు 28న హ్యాకథాన్ నిర్వహిస్తారు. విశ్వవిద్యాలయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హ్యాకథాన్ కన్వీనర్ ఆచార్య డి.లలిత భాస్కరి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట్రావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు, డీన్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో జాతీయ పతాకం ప్రదర్శన



బీచ్‌రోడ్డులో జాతీయ జెండాతో కళాశాల విద్యార్థులు

ఏయూ క్యాంపస్ : స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్ (సీపీఏ) జూనియర్ కళాశాల విద్యార్థులు బీచ్ రోడ్డులో 80 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఆర్కే బీచ్ వద్ద గురువారం సాయత్రం కళాశాల విద్యార్థులు దీనిని ప్రదర్శించారు. దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, పి.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్య అచీవర్స్ డే



విద్యార్థినిని అభినందిస్తున్న హోం మంత్రి అనిత, ఎంపీ భరత్

మద్దిలపాలెం : ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు వివిధ కార్పొరేట్ కంపెనీల్లో 5415 ఉద్యోగాలు కైవసం చేసుకున్న సందర్భంగా ఆదిత్య అచీవర్స్ డే – 2025 పేరిట ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ శ్రీభరత్ పాల్గొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉద్యోగార్థులుగా ఎదగడానికి ఉత్తమ లక్ష్యంతో రాణించాలని సూచించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ 2024 – 25 విద్యా సంవత్సరం ముగియక ముందే ఒక్క విశాఖపట్నంలోనే ఆదిత్య డిగ్రీ కళాశాలల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఇప్పటి వరకు 5,415 ఉద్యోగాలు పొందారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామక్రిష్ణ, ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా దాహం కేకలే





పదకొండో వార్డు ముస్తఫాకాలనీలో జీవీఎంసీ వాటర్ ట్యాంకరు వద్ద నీరు పడుతున్న మహిళలు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో ఏ వార్డుకెళ్లినా దాహం కేకలే వినిపిస్తున్నాయి. తాగు నీటికి స్థానికులు విలవిల్లాడుతున్నారు. బోర్లులో నీరు రాకపోవడం, కుళాయిల ద్వారా వచ్చిన నీరు చాలకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో 10, 11, 12, 13వ వార్డుల్లో ఎక్కడ చూసినా తాగు నీటి సమస్యే కనిపిస్తోంది. పదకొండో వార్డు పరిధి ముస్తఫా కాలనీలో కుళాయి నీరు చాలకపోవడంతో నీటి సరఫరా విభాగం సిబ్బంది గురువారం జీవీఎంసీ వాటర్ ట్యాంక్ తీసుకెళ్లారు. దీంతో ఆ ట్యాంక్ వద్దకు స్థానిక మహిళలు ఒక్క క్షణంలో బిందెలు పట్టుకుని గుమిగూడారు. నీటి కోసం ఎదురు చూస్తున్న ఆ మహిళలు అవకాశం దొరికిందంటూ సుమారు 10 నిమిషాల్లో ట్యాంక్‌లోని నీటిని ఖాళీ చేసేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఆరిలోవ ప్రాంతంలో భూగర్భ జలాలు ఎండిపోయాయి. దీంతో బోర్లులో నీరు తగ్గిపోయింది. ముడసర్లోవ రిజార్వాయర్‌లోని నీటి మట్టం అడుగంటుతుండడంతో కుళాయి నీరు కూడా సరిగా సరఫరా జరగడం లేదు. దీంతో స్థానికులకు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి.

ష్యూరిటీ బాండ్లతో చంద్రబాబు బురిడీ

- వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



23వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం : ఇంటింటికీ లక్షలాది రూపాయిలు ఇస్తామని, ఆ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని నమ్మించడానికి ష్యూరిటీ బాండ్లు ఇచ్చి ఓట్లు దండుకున్న తర్వాత ప్రజలను చంద్రబాబు బురిడీ కొట్టించారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. దగాకోరు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జీవీఎంసీ 23వ వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు బూస రమణా రెడ్డి ఆధ్వర్యంలో ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ’ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి, ప్రజలను మోసం చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలు అందరూ తెలుసుకుని బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బోర కుమార్ రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, గుడ్ల గణేష్ రెడ్డి, నగిరెడ్ల పోలిశెట్టి, పులగం కొండారెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, ఏరుసు అరుణ, బోర రామిరెడ్డి, బోస రమణరెడ్డి, గుడ్ల కైలాస్ రెడ్డి, గుమ్మడి మణి, గేదెల వెంకటలక్ష్మి, చిల్ల నారాయణరావు, ఎల్లయ్య రెడ్డి, అన్నాజీ, పుట్ట రమణమ్మ, కేవీ రమణ, సాలా చిన్ని, కారపురెడ్డి దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్‌సీపీ చేపట్టిన ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ’ కార్యక్రమం గురువారం 17వ వార్డులో కొనసాగింది. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలా రెడ్డి, 140వ నంబరు బూత్ కన్వీనర్ కండిపల్లి కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా హామీల అమలులో విఫలమయ్యారన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కిన కూటమి నాయకులను నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, మహిళ విభాగం అధ్యక్షురాలు, బూత్ కన్వీనర్ పిల్లా సత్యవతి, గణేష్‌రెడ్డి, కుసుమా రెడ్డి, లక్ష్మణ రెడ్డి, దానేష్, అప్పలరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో కరపత్రాలు పంచుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పునః ప్రారంభం



త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సీపీ శంఖబ్రత బాగ్చీ, పోలీస్ అధికారులు

అల్లిపురం : మరమ్మతులు పూర్తి చేసి ఆధునికీకరించిన మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ గురువారం ప్రారంభించారు. స్టేషన్ భవనం దుస్థితిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన సీపీ మరమ్మతుల కోసం రూ.5.5 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం మరమ్మతులు చేయించినందున మరో పది సంవత్సరాల వరకు బిల్డింగ్‌కు నష్టం లేదని సీపీ అన్నారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీపీ – 1 అజిత వేజెండ్ల, డీసీపీ – 2 డి.మేరీ ప్రశాంతి, డీసీపీ అడ్మిన్ కృష్ణకాంత్ పటేల్, క్రైం డీసీపీ కె.లతా మాధురి, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వుమెన్ ఇంజినీరింగ్ కళాశాలలో సెమినార్



అతిథులను సత్కరిస్తున్న ఏయూ వుమెన్ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు

మద్దిలపాలెం : ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వుమెన్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో బ్లూప్రింట్ ఫర్ అకడమిక్ అండ్ కెరీర్ ఎక్సలెన్స్ అంశంపై సెమినార్ గురువారం నిర్వహించారు. ఈ సెమినార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మశ్రీ, మెకానికల్ విభాగాధిపతి ఆచార్య మధుసూదన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ టెక్నాలజీ లిమిటెడ్ డిజైన్ ఇంజినీర్ ప్రసంగించారు. అనంతరం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్ గేట్ – 2026 పరీక్షలకు వ్యూహాన్ని వివరించారు. ప్రణాళిక ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. మాజీ శాస్త్రవేత్త సీటెక్ ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.పి.రాజు సక్సెస్ బై డిజైన్ అప్రోచ్ టూ పర్సనాలిటీ డవలప్‌మెంట్ అనే అంశంపై ప్రసంగించారు.

చిన్నారుల వికాసానికి ప్రాధాన్యమివ్వాలి



గోపికలు, కృష్ణుని వేషధారణలో చిన్నారులు

ఏయూ క్యాంపస్ : చిన్నారుల సమగ్ర వికాసానికి ప్రాధాన్యమివ్వాలని గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి అన్నారు. బీచ్‌రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలంలో సాంప్రదాయ, లలిత కళల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. చిన్నారుల్లో భారతీయ నాగరికత పెంపొందించే దిశగా విద్యా సంస్థలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధురవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శ్రీ కృష్ణుని వేషధారణలో, మరికొందరు గోపికల వేషధారణలో అలరించారు.